సాక్షి నల్లగొండ

శుక్రవారం । 14 । ఏప్రిల్ । 2023



వేసవిలో జర జాగ్రత్త

వేసవిలో అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అప్రమత్తంగా ఉండాలని ఫైర్ సిబ్బంది సూచిస్తున్నారు.
- 8లో



ముస్లింల సంక్షేమానికి ప్రాధాన్యం

బీఆర్ఎస్ ప్రభుత్వం ముస్లింల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు.
- 10లో

గరిష్టం/కనిష్టం
41°/25°

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.



న్యూస్‌రీల్

నేడు అంబేద్కర్ జయంతి ఉత్సవాలు

- హాజరుకానున్న మంత్రి, మండలి చైర్మన్

నల్లగొండ: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను శుక్రవారం నల్లగొండలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈమేరకు మర్రిగూడ బైపాస్ రోడ్డు వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి, ఎంపీలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నివాళులర్పించనున్నారు.

దివ్యాంగ ఉపకరణాలకు దరఖాస్తుల ఆహ్వానం

రామగిరి(నల్లగొండ): జిల్లాలోని దివ్యాంగులు 100 శాతం సబ్సిడీతో అన్ని రకాల ఉపకరణాలకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా వయో వృద్ధుల సంక్షేమ శాఖ అధికారిణి సుభద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 25 లోపు www.tsobmms.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు.

గతంలో మాదిరిగా రైళ్లు నిలపాలి



సికింద్రాబాద్‌లో సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

నల్లగొండ టూటౌన్, మిర్యాలగూడ టౌన్: నల్లగొండ, మిర్యాలగూడ రైల్వే స్టేషన్‌లలో గతంలో మాదిరిగానే అన్ని రైళ్ల నిలుపుదల చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి కోరారు. ఈమేరకు గురువారం సికింద్రాబాద్‌లోని సౌత్ సెంట్రల్ రైల్వే సికింద్రాబాద్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, చీఫ్ ప్యాసింజర్ ట్రాఫిక్ మేనేజర్ సత్యనారాయణలకు బీజేపీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కరోనా ముందు మిర్యాలగూడ రైల్వే స్టేషన్‌లో నారాయణాద్రి, విశాఖ, చెన్నై, నర్సాపూర్‌తో పాటు డెల్టా ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిపేవారని, కరోన తరువాత రైళ్లు నిలపకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైళ్లు నిలుపుదల చేస్తే ప్రతి నెలా ఈ రైల్వే స్టేషన్‌లో 45వేల మంది ప్రయాణికులు ఉపయోగించుకుంటారని తెలి పారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీజేపీ రాష్ట్ర నేత సాధినేని శ్రీని వాస్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు రేపాల పురుషోత్తంరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల రమేష్‌కుమార్, నాయకులు నిమ్మల రాజశేఖర్‌రెడ్డి, ఐతరాజు సిద్ధు తదితరులు ఉన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి



మాట్లాడుతున్న యూసూఫ్

నల్లగొండ టౌన్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసూఫ్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన జిల్లా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కార్మిక చట్టాలను మార్చి పెట్టుబడిదారులకు కొమ్ముకాసే చర్యలకు పాల్పడుతుందని ఆరోపించారు. కార్మిక హక్కుల కోసం అమరవీరుల పోరాట స్ఫూర్తితో మరో పోరాటానికి సిద్ధం కావాలన్నారు. కాంట్రాక్టు వ్యవస్థ రద్దు చేసి ప్రభుత్వమే నియామకాలను చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ సీనియర్ నాయకుడు ఉజ్జిని రత్నాకర్‌రావు, జిల్లా కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, ఎస్.రామస్వామి, కేఎస్‌రెడ్డి, నూనె వెంకటేశ్వర్లు, బరిగల వెంకటేష్, డి.వెంకటేశ్వర్లు, బంటు రాజేశ్వరీ, రాజు, లెనిన్, అమీర్, నర్సింహ, వెంకటయ్య, మల్లయ్య, లచ్చయ్య, నరేందర్, యాదయ్య, లక్ష్మయ్య, శివయ్య, అశోక్ పాల్గొన్నారు.

రుణమస్తు!

రికార్డు స్థాయిలో రుణాలు అందజేసిన డీసీసీబీ

- మార్చి 31 నాటికి రూ.1484 కోట్ల అవుట్ స్టాండింగ్ రుణాల పంపిణీ
- వ్యవసాయ రంగానికి పెద్దపీట
- విద్యారుణాలతో విదేశీ విద్యకు చేయూత



నల్లగొండ అగ్రికల్చర్: గతంలో అలంకార ప్రాయంగా ఉన్నటువంటి సహకార రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పునరుజ్జీవం పోసింది. సహకార రంగానికి అధిక ప్రాధాన్యతనిచ్చి డీసీసీబీలను బలోపేతం చేసింది. తక్కువ వడ్డీతో రుణాలను రైతులకు లక్ష్యానికి మించి అందించే విధంగా ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. దీంతో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పాలకవర్గం నూతనంగా బాధ్యతలను స్వీకరించిన తరువాత రెట్టింపు ఉత్సాహంతో గత మూడేళ్లుగా రికార్డు స్థాయిలో రుణాలను ఇస్తోంది. గత పాలకవర్గాలు చేసిన కొన్ని తప్పిదాల కారణంగా డీసీసీబీపై రైతుల్లో సన్నగిల్లిన నమ్మకాన్ని మరింత రెట్టింపు చేసి సహకార బ్యాంకుపై రైతులు, ఖాతాదారుల్లో పూర్తి భరోసా కల్పించేలా నూతన పాలకవర్గం చర్యలను చేపట్టి నూటికి నూరుపాళ్లు సఫలీకృతమైంది.

లక్ష్యాలను అధిగమిస్తూ..

పాలకవర్గం బాధ్యతలను స్వీకరించే నాటికి తమ ఎదుట ఉన్న సవాళ్లను అధిగమించి లక్ష్యానికి మంచి రుణాలను అందిస్తూ వస్తుంది. బాధ్యతలను చేపట్టే నాటికి అవుట్ స్టాండింగ్ రుణాలు రూ. 660.92 కోట్లు ఉండగా ప్రస్తుతం మార్చి 31 నాటికి రూ.1484 కోట్ల అవుట్ స్టాండింగ్ రుణాలు ఇచ్చి రికార్డు సృష్టించింది. అందులో పంట రుణాలు రూ.539 కోట్ల వరకు రైతులకు అందించింది. 7040 మంది రైతులకు రూ.352.14 కోట్లు రుణాలను గొర్రెలు, మేకల పెంపకం కోసం, పాడి గేదెలు, కోళ్ల పెంపకం కోసం అందించింది.

విద్యారుణాలు

ఎడ్యుకేషన్ లోన్స్ పథకాన్ని ప్రవేశపెట్టి ఇప్పటి వరకు 905 మంది రైతు బిడ్డలు విదేశాల్లో చదువుకునేందుకుగాను రూ.138.60 కోట్ల రుణాలను అందించింది. ఏ కమర్షియల్ బ్యాంకు ఇవ్వని విధంగా కేవలం భూమిని తనఖా పెట్టుకుని విదేశీ విద్యకు రుణాలు అందించడం విశేషం.

30 బ్రాంచీల ద్వారా సేవలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు తన 30 బ్రాంచీల ద్వారా రైతులకు సేవలు అందిస్తోంది. 4,26,167 మంది రైతులకు తన సహకారాన్ని అందిస్తుంది. జిల్లా వ్యాప్తంగా 14 ఏటీఎంలతో పాటుగా జిల్లాకు ఒక మొబైల్ ఏటీఎంతో కలిపి మొత్తం 17 ఏటీఎంలతో డీసీసీబీ తన సేవలను అందిస్తోంది. త్వరలో మొబైల్ బ్యాంకింగ్, యూపీఐ సేవలను అందుబాటులోకి తేనుంది.

వివిధ రకాల రుణాలు

బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టుకుని రూ.275 కోట్లు, కర్షక మిత్ర, నాన్‌అగ్రిమార్ట్‌గేజ్ రుణాలు 1,820 మంది రైతులకుగాను రూ.114.63కోట్లు, పీఏసీఎస్‌కు మల్టీపర్పస్ సెంటర్‌ల ఏర్పాటుకు ఉమ్మడి జిల్లాలోని 25 సంఘాలకు రూ.10.67 కోట్లు రుణాలను ఇచ్చింది.

2.05 శాతంగా ఏన్‌పీఏ..

గతంలో బ్యాంకు నిరర్ధక ఆస్తుల శాతం(ఎన్‌పీఏ) 6.55 శాతంగా ఉండగా నూతన పాలకవర్గం వచ్చిన తరువాత వ్యాపారాలను పెంచి అధిక లాభాలను గడించడం ద్వారా బ్యాంకు నిరర్ధక ఆస్తుల శాతం 2.05 శాతంగా ఉంది. ఈమేరకు రాష్ట్రంలో రికార్డు సాధించిన రెండో బ్యాంకుగా డీసీసీబీ నిలిచింది.

రూ. 36.5 కోట్ల లాభాల్లో..

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ప్రస్తుతం రూ.2100 కోట్ల వ్యాపారంతో రూ.36 కోట్ల 50 లక్షల లాభాలను గడించి అభివృద్ధి పథంలో పయనిస్తోంది. రుణాలు ఇవ్వడంతో పాటుగా వసూళ్లను కూడా రికార్డు స్థాయిలో చేయడం విశేషం.



మాట్లాడుతున్న బడుగుల లింగయ్యయాదవ్, చిత్రంలో ఎమ్మెల్యే రవీంద్రకుమార్ తదితరులు

రానున్న రోజుల్లో తిరుగులేని శక్తిగా బీఆర్ఎస్

- రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్

దేవరకొండ: రానున్న రోజుల్లో దేశ రాజకీయాల్లో బీఆర్ఎస్ పార్టీ తిరుగులేని శక్తిగా రూపుదిద్దుకోనుందని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. గురువారం దేవరకొండ పట్టణంలోని సాయిరమ్య ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ దేవరకొండ మండల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇప్పటికే దేశ రాజకీయాల్లో గులాబీ శకం మొదలైందన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో నేడు రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో దేవరకొండ నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పంపిన సందేశాన్ని ఆయన చదివి వినిపించారు. అంతకుముందు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు టీవీఎన్ రెడ్డి, పున్న వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ మారుపాకుల అరుణసురేష్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ పల్లా ప్రవీణ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్, వైస్ చైర్మన్ రహత్‌అలీ, నాయకులు గాజుల ఆంజనేయులు, నాయిని సుధీర్‌రెడ్డి, హన్మంతు వెంకటేష్‌గౌడ్, వేముల రాజు, శ్రీనునాయక్, బొడ్డుపల్లి కృష్ణ, ఆయా గ్రామాల బీఆర్ఎస్ సర్పంచ్‌లు, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు తదితరులున్నారు.

టెన్త్ మూల్యాంకనం ప్రారంభం

- పేపర్లు దిద్దే విధానంపై సీఈ, ఏఈలకు శిక్షణ
- నేటి నుంచి స్పెషల్ అసిస్టెంట్లు విధుల్లోకి
- మూల్యాంకనం చేసిన జవాబు పత్రాలను పరిశీలించనున్న అధికారులు

నల్లగొండ: పదో తరగతి పరీక్ష జవాబు పత్రాల మూల్యాంకనం ప్రారంభమైంది. గురువారం నల్లగొండలోని లిటిల్ ఫ్లవర్ విజ్ఞాన మందిర్ పాఠశాలలో మూల్యాంకనం నిర్వహించారు. ఈ నెల 21 వరకు జరగనుంది. పేపర్ల మూల్యాంకనానికి సంబంధించి ఇప్పటికే 2.49లక్షల జవాబు పత్రాలు జిల్లాకు వచ్చాయి.

కట్టుదిట్టమైన చర్యలు

మూల్యాంకనం ప్రారంభమైనందున శుక్రవారం నుంచి స్పెషల్ అసిస్టెంట్లు విధుల్లోకి హాజరుకానున్నారు. గురువారం మూల్యాంకనం చేసిన పేపర్లను వారు పరిశీలించనున్నారు. నిబంధనల ప్రకారం మార్కులు వేశారా లేదా, ఎవరికైనా తక్కువ వేశారా.. లేక ఎక్కువ మార్కులు పడ్డాయా.. వేసిన మార్కులు అన్ని సక్రమంగా కూడి వేశారా అనేది పరిశీలించి ఏమైనా మార్పులు ఉంటే వాటిని సరిచేసేందుకు అధికారులకు పంపిస్తారు. అధికారులు తిరిగి వాటిని పరిశీలించి వారు సూచించిన ప్రకారం ఏమైనా తేడా ఉంటే సరిచేస్తారు. అయితే మూల్యాంకనం సందర్భంగా ఎవరిని లోపలికి రాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఐడీ కార్డు ధరించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. పేపర్ లీకేజీల సంఘటనల నేపథ్యంలో అధికారులు గట్టి నిఘా మధ్య మూల్యాంకనం చేస్తున్నారు.

మూల్యాంకనంపై శిక్షణ..

పేపర్లు దిద్దేందుకు వచ్చిన చీఫ్ ఎగ్జామినర్లు, అసిస్టెంట్ ఎగ్జామినర్లకు జవాబు పత్రాలు ఏవిధంగా దిద్దాలి, నిబంధనల ప్రకారం ఎలా మార్కులు వేయాలనే విషయంపై ఉదయం శిక్షణ ఇచ్చారు. విద్యాశాఖ ఇచ్చిన నిబంధనలను వారికి తెలియజేశారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మూల్యాంకనం ప్రారంభించారు.

సీపీఆర్‌తో ప్రాణాపాయం నుంచి కాపాడొచ్చు

- ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి




సీపీఆర్ విధానాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ: ఆకస్మిక గుండెపోటుకు గురైన వారికి సకాలంలో సీపీఆర్ (కార్డియో పల్మనరీ రిసోసియేషన్) చేస్తే ప్రాణాలను కాపాడొచ్చని ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో లైఫ్ సేవింగ్ టెక్నిక్ శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి సమాజంలో ఆహారపు అలవాట్లు మారి ఎక్కువగా షుగర్, బీపీలు పెరిగి ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. ప్రజలు ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ముందస్తుగా డాక్టర్లను సంప్రదించి వారు సలహాలు సూచనలు పాటించాలని చెప్పారు. అదేవిధంగా పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలని పేర్కొన్నారు. ఇటీవల గుండెపోటుతో మృతిచెందుతున్న వారి సంఖ్య పెరుగుతుందన్నందున ఆరోగ్యశాఖ నివేదిక అనుసరించి సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ఆకస్మిక గుండెపోటులను తగ్గించడానికి సీపీఆర్ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ శిక్షణ డాక్టర్లు, అధికారులు, పోలీసులకే, కాకుండా ఆర్ఎంపీలు, యువజన సంఘాల సభ్యులకు కూడా ఏర్పాటు చేయాలని కోరారు. కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ సీపీఆర్‌పై అవగాహన పెంచుకోవడానికి శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిక్షణా కార్యక్రమంలో డీఐఓ జమిలుద్దీన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సీపీఆర్ విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుష్బూ గుప్తా, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, జిల్లా పరిషత్ సీఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ కొండల్ రావు,జిల్లా ఉప వైద్య అధికారి డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనారసింహుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో గురువారం నిత్యారాధనలు కొనసాగాయి. ఆలయ మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహనసేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, జోడు సేవోత్సవం, సహస్రనామార్చన పూజలు గావించారు. రాత్రి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు. వివిధ పూజల ద్వారా నిత్యాదాయం రూ.14,88,973 సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న ఆచార్యులు

కొనుగోలు కేంద్రాల్లో వసూళ్ల పర్వం

- ప్రతి సెంటర్‌కు రూ.3 వేల నుంచి రూ.5వేల వరకు డిమాండ్
- ఇబ్బంది పడుతున్న కేంద్రం నిర్వాహకులు



త్రిపురారం ఐకేపీ సెంటర్‌లో ఆరబోసిన ధాన్యం

త్రిపురారం: రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఐకేపీ, పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. కానీ గ్రామ స్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహించే నిర్వాహకులు సెంటర్ నడుపుతున్నందుకు ప్రతి సెంటర్‌కు రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు ఇవ్వాలని మండల స్థాయి అధికారులు డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో నిర్వాహకులు చేసేదేమీ లేక రైతుల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నట్లు సమాచారం. త్రిపురారం మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో త్రిపురారం, పెద్దదేవులపల్లి, బొర్రాయిపాలెం, అప్పలమ్మగూడెం, డొంకతండా, కొణతాలపల్లి, దుగ్గెపల్లి, వస్త్రాంతండా, అల్వాలపాడ్, లచ్యాతండా, నీలాయిగూడెం, మాటూర్ గ్రామాల్లో.. ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో బాబుసాయి పేట, పెద్దదేవులపల్లి, కంపాసాగర్‌లో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. పలు గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు నిర్వాహకులు ఫోన్ పే, గూగుల్‌పే ద్వారా డబ్బులు కూడా పంపినట్లు సమాచారం. అయితే ఐకేపీ కేంద్రం నిర్వాహకుల వద్ద డబ్బుల వసూళ్లపై త్రిపురారం ఏపీఎంను వివరణ కోసం ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వసతులు నిల్

ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఐకేపీ కేంద్రాల వద్ద టెంటు ఏర్పాటు చేసి ధాన్యం రాసులపై కప్పుకోవడానికి పట్టాలు అందుబాటులో ఉండే విధంగా చూడాలని రైతులు కోరుతున్నారు.

ధాన్యం కొనుగోలుపై ట్యాబ్ ఆపరేటర్లకు శిక్షణ



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ కాళిందిని

నల్లగొండ: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం విక్రయించిన తరువాత రైతుకు సంబంధించిన వివరాలు ట్యాబ్ ఎంట్రీ సకాలంలో చేయాలని డీఆర్‌డీఓ కాళిందిని, డీఎస్ఓ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం టీటీడీసీలో యాసంగి 2022-23 వరి ధాన్యం ఐకేపీ కొనుగోలు కేంద్రాల నిర్వహణపై ట్యాబ్ ఆపరేటర్‌లకు ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి అన్ని ఆధారాలతో ట్యాబ్‌లో ఎంట్రీ చేయడం వల్ల రైతులకు త్వరితగతిన డబ్బులు అందుతాయన్నారు. కార్యక్రమంలో పౌరసరఫరాల డీఎం నాగేశ్వర్‌రావు, అడిషనల్ పీడీ సరస్వతి, డీపీఎంలు, ట్యాబ్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించాలి

ప్రతి గ్రామంలో ఉపాధి పనులు కల్పించాలని డీఆర్‌డీఓ కాళిందిని అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్ నుంచి ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపీఓలతో జెడ్పీసీఈఓతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకంలో లేబర్ మొబిలైజేషన్, నర్సరీలు, తెలంగాణ క్రీడా ప్రాంగణాలు, గ్రామపంచాయతీల్లోని సెగ్రిగేషన్ షెడ్ల నిర్వహణ, నీళ్ల ట్యాంకులు, మొక్కల సంరక్షణ, తదితర అంశాలపై సమీక్షించారు. కృష్ణానది పరీవాహక ప్రాంతాల్లో మొక్కలు నాటడానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి మాట్లాడుతూ శుక్రవారం నుంచి హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులో ఏర్పాటు చేసిన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఎంపిక చేసిన వారందరికీ ఐడీ కార్డులు పంపిణీ చేసినట్లు తెలిపారు.

జంతు సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి

- జిల్లా అటవీ అభివృద్ధి శాఖ అధికారి రాంబాబు



అటవీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న రాంబాబు

దేవరకొండ: వేసవిని దృష్టిలో ఉంచుకొని అటవీ జంతువుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా అటవీ అభివృద్ధిశాఖ అధికారి రాంబాబు అధికారులకు సూచించారు. అటవీ జంతువుల దాహార్తిని తీర్చేందుకు క్షేత్రస్థాయిలో ప్రణాళికలు రూపొందించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గురువారం దేవరకొండ, చందంపేట మండల పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతాన్ని స్థానిక అటవీశాఖ అధికారులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వేసవి దృష్ట్యా జంతువుల దాహార్తిని తీర్చేందుకు చేపట్టిన పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలిచ్చారు. అటవీ జంతువుల సంరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. జంతువుల దాహార్తిని తీర్చేందుకు అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన నీటి తొట్లల్లో నీరు ఉండేలా చూడాలన్నారు. ఆయన వెంట నాగార్జునసాగర్ ఎఫ్‌డీఓ సర్వేశ్వర్, దేవరకొండ ఎఫ్ఆర్ఓ సాయిప్రకాష్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

స్పిల్‌వే పనుల పరిశీలన



స్పిల్‌వే పనులు పరిశీలిస్తున్న అధికారులు

నాగార్జునసాగర్: సాగర్ ప్రాజెక్ట్ స్పిల్‌వే పనులను క్వాలిటీ కంట్రోల్ అధికారులు గురువారం పరిశీలించారు. 11సంవత్సరాల తర్వాత రూ.19.99కోట్ల వ్యయంతో పనులు చేపట్టారు. ఈమేరకు స్పిల్‌వేపై పడిన గుంతలను జాతీయ నిర్మాణ సంస్థ సూచించిన కాంక్రీట్ మిక్స్‌డ్ డిజైన్ ప్రకారం ఏయే గ్రేడ్ సిలికాఫ్యూమ్ వాడుతున్నారో పరిశీలించారు. బకెట్ పోర్షన్ పైభాగంలో ఏ మేరకు గుంతలు పడ్డాయి.. వాటిని ఏవిధంగా కాంక్రీట్‌తో నింపుతున్నారని అడిగి తెలుసుకున్నారు. పరిశీలించిన వారిలో క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజనీర్ వెంకటకృష్ణ, ఎస్ఈ శ్రీనివాసరావు, ఈఈ గోపాల్‌రెడ్డి స్థానిక ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

ఫార్మాను అడ్డుకుంటేనే మునుగోడు మనుగడ

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్



సమావేశంలో అభివాదం చేస్తున్న నాయకులు

మునుగోడు: ప్రజల ప్రాణాలను హరించే ఫార్మా కంపెనీలను అడ్డుకుంటనే మునుగోడు ప్రజల మనుగడ కొనసాగుతుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మునుగోడు మండలంలోని కిష్టాపురం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఫార్మా కంపెనీని రద్దు చేసేందుకు చేపట్టాల్సిన ఆందోళన కార్యక్రమాలపై గురువారం మునుగోడులో అఖిలపక్ష పార్టీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఫ్లోరిన్ సమస్యతో అనారోగ్యాల బారినపడిన ప్రజలపై ప్రభుత్వాలు ఫార్మాను తీసుకొచ్చి పెడితే మునుగోడు ప్రాంతం 100 ఏళ్ల వెనక్కిపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రజల ఆరోగ్యాలు దెబ్బ తినకుండా కాపాడాల్సిన కాలుష్య నియంత్రణ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఈ ప్రాంతంలోని పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు గమనించి ఐక్య ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. కరోనా సమయంలో కేంద్ర ప్రభుత్వం ఫార్మా కంపెనీల అనుమతికి కొన్ని సడలింపులు ఇవ్వడంతో రాష్ట్ర వ్యాప్తంగా కొందరు అక్రమ వ్యాపారులు దొడ్డిదారిన 240 కంపెనీలకు అనుమతి తీసుకున్నారన్నారు.

ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు అభిప్రాయాలు తెలపాలి

ప్రజల ఆరోగ్యాలకు హానీ కలిగించే ఫార్మా కంపెనీలు మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా ఏర్పాటవుతుంటే ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తమ అభిప్రాయాలను చెప్పకపోవడం విచారకరమని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. ఫార్మా కంపెనీ అనుమతి రద్దు చేయాలని ఈ నెల 18న చేపట్టే చలో కిష్టాపురం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా అఖిల పక్ష నాయకులు మునుగోడు అంబేద్కర్ చౌరస్తా నుంచి కిష్టాపురం వరకు పాదయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. అంతకుముందు ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ బాబురావు ఫార్మా కంపెనీల వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెలమల్ల కృష్ణారెడ్డి, ఎంపీపీ కర్నాటి స్వామి యాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నారబోయిన రవి, బీఎస్పీ నియోజకవర్గ కన్వీనర్ అందోజు శంకరాచారి, మాజీ ఎంపీపీ పోలగోని సత్యం గౌడ్, ఫార్మా వ్యతిరేక కమిటీ కన్వీనర్ భీమనపల్లి సైదులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

బీపీ మండల్ పోరాటం మరువలేనిది

మునుగోడు: బడుగు, బలహీన వర్గాల రిజర్వేషన్ల సాధనకు బీపీ మండల్ చేసిన పోరాటం మరువలేనిదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గురువారం బీపీ మండల్ వర్ధంతి సందర్భంగా మునుగోడులోని అంబేద్కర్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూడిద మల్లికార్జున్ యాదవ్, బీసీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పానుగంటి విజయ్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు గుంటోజు వెంకటాచారి పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహిళ మెడలో నుంచి పుస్తెలతాడు చోరీ


బాధితురాలి నుంచి వివరాలు తెలుసుకుంటున్న సీఐ విఠల్‌రెడ్డి, ఎస్‌ఐ బాలకృష్ణ

చింతపల్లి : నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలో నుంచి గుర్తుతెలియని వ్యక్తులు పుస్తెల తాడు చోరీకి చేసిన సంఘటన గురువారం మండల పరిధిలోని గొల్లపల్లిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపిన ప్రకారం.. గొల్లపల్లి గ్రామానికి చెందిన అనంతుల రాములమ్మ గ్రామం నుంచి కుర్మేడు ఎక్స్‌రోడ్డుకు గురువారం మధ్యాహ్నం సమయంలో ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తుండగా, ఇద్దరు యువకులు బైక్‌పై వచ్చి ఆమె మెడలో ఉన్న మూడున్నర తులాల పుస్తెలతాడును లాక్కొని పరారయ్యారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ బాలకృష్ణతో పాటు నాంపల్లి సీఐ విఠల్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. బాధితురాలు రాములమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

డీజిల్ దొంగతనం చేస్తున్న ఇద్దరి అరెస్ట్

కోదాడరూరల్: జాతీయ రహదారులపై ఆగి ఉన్న వాహనాల్లో డీజిల్ దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు యువకులను కోదాడ రూరల్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. ఎస్‌ఐ సాయిప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లాకు చెందిన తేజవత్ చిన్న ఠాగూర్‌నాయక్, వనపర్తి జిల్లాకు చెందిన కాట్రావత్ హరీష్ ఇరువురు బంధువులు. జల్సాలకు అలవాటు పడిన వీరిద్దరు కారులో తిరుగుతూ గతంలో పలు చోట్ల రహదారుల పక్కన ఆపిన వాహనాల్లో డీజిల్ దొంగతనాలకు పాల్పడినప్పటికీ ఎక్కడా పోలీసులకు చిక్కలేదు. అయితే గురువారం తెల్లవారుజామున రాష్ట్ర సరిహద్దు అయిన కోదాడ మండలం రామాపురం క్రాస్ రోడ్‌లో ఓ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీస్ వద్ద నిలిపి ఉంచిన లారీ నుంచి నాలుగు క్యాన్లలో 120 లీటర్ల డీజిల్‌ను దొంగలించారు. దొంగిలించిన డీజిల్‌ను కారు డిక్కీలో పెట్టుకొని హైదరాబాద్ వైపు వెళ్తూ అనుమానాస్పదంగా కనిపించడంతో కోదాడ రూరల్ పోలీసులు వారిని ఆపి కారులో తనిఖీ చేయగా డీజిల్ క్యాన్లు ఉన్నట్లు గుర్తించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించగా చేసిన నేరం ఒప్పుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. కాగా ఇదివరకే హరీష్‌పై ఓ హత్యకేసు, ఠాగూర్‌పై హత్యాయత్నం కేసు ఉన్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేసవిలో జర జాగ్రత్త


అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది (ఫైల్)



అగ్నిమాపక వారోత్సవాలు ప్రచార కరపత్రాలు విడుదల చేస్తున్న అధికారులు

- అగ్నిప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలంటున్న ఫైర్ సిబ్బంది
- నేటి నుంచి 25వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు

నకిరేకల్: వేసవిలో అగ్నిప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉందని, ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉంటుందని, ప్రమాదాలు జరగకుండా అప్రమత్తతే శ్రీరామరక్ష అని ఫైర్ సిబ్బంది సూచిస్తున్నారు. ప్రతి యేటా నిర్వహించే అగ్నిమాపక వారోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ నెల 25వ తేదీ వరకు జరిగే ఈ వారోత్సవాలలో భాగంగా ఉమ్మడి జిల్లాలోని ఆయా ఫైర్ స్టేషన్ల ఆధ్వర్యంలో గ్రామాల్లో అగ్ని ప్రమాదాల నివారణ చర్యలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఏదైనా అగ్ని ప్రమాదం జరిగితే వెంటనే 101 నంబర్‌కు సమాచారం అందించాలని కరపత్రాలతో ప్రచారం చేయనున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 13 ఫైర్ స్టేషన్లు ఉన్నాయి. నల్లగొండ జిల్లాలో నల్లగొండ, దేవరకొండ, నకిరేకల్, మిర్యాలగూడ, హాలియా, సూర్యాపేట జిల్లాలో సూర్యాపేట, హుజూర్‌నగర్, కోదాడ, యాద్రిది భువనగిరి జిల్లాలో భువనగిరి, యాదగిరిగుట్ట, ఆలేరు, మోత్కూరు, చౌటుప్పల్‌లో అగ్నిమాపక కేంద్రాలు సేవలు అందిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో జరిగే చాలా అగ్ని ప్రమాదాలకు అజాగ్రత్తలే కారణమని ఫైర్ సిబ్బంది అంటున్నారు. కిరోసిన్ దీపం ఇంటి చూరుకు అంటుకుపోవడం, దేవుళ్ల ముందు పెట్టిన దీపం ఎలుకలు ఎత్తుకుపోవడం, పెంట కుప్పల్లో నిప్పు రాజుకొని మంటలు ఎగసిపడడం, గడ్డివాములు, చెత్త కుప్పలు ఉన్న చోట బీడీ, చుట్టలు కాల్చిపడేయడం, వంట చేసిన తర్వాత పొయ్యిలో నిప్పులు ఆర్పకపోవడం వంటి వాటి వలన ఎక్కువగా అగ్ని ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే అగ్ని ప్రమాదాలను అరికట్టవచ్చని పేర్కొంటున్నారు.

సిబ్బంది లేక ఇబ్బంది..

అయితే ఉమ్మడి జిల్లాలో కేవలం 13 ఫైర్ స్టేషన్లు మాత్రమే ఉన్నాయని, ఏదైనా ప్రమాదాలు జరిగినప్పుడు ఫైరింజన్ వచ్చే లోపే తీవ్ర నష్టం జరుగుతుందని ప్రజలు అంటున్నారు. ఫైరింజన్‌ల సంఖ్యను పెంచాలని, కనీసం రెండు మూడు మండలాలకు ఒక ఫైర్ స్టేషన్‌నైనా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అదేవిధంగా సిబ్బంది కొరత, అరకొర సౌకర్యాలతో తాము కూడా చాలా ఇబ్బందులు పడుతున్నామని ఫైర్ సిబ్బంది పేర్కొంటున్నారు. చాలా ఫైర్ స్టేషన్‌లలో కనీస సౌకర్యాలు కూడా లేవని, గ్రామీణ రహదారులు కూడా అంతంతమాత్రంగానే ఉండడంతో సకాలంలో ప్రమాద స్థలానికి చేరుకోలేకపోతున్నామని అంటున్నారు.

నకిరేకల్‌లో తాత్కాలిక షెడ్డులోనే..

నియోజకవర్గ కేంద్రమైన నకిరేకల్‌లో ఏర్పాటు చేసిన అగ్నిమాపక కేంద్రం అరకొర వసతుల నడుమ కూనరిల్లుతోంది. గత 20 ఏళ్ల నుంచి తాత్కాలిక షెడ్డులోనే ఈ అగ్నిమాపక కేంద్రం కొనసాగుతుంది. ఈ కేంద్రం పరిధిలో నకిరేకల్, శాలిగౌరారం, కట్టంగూర్, కేతేపల్లి మండలాలున్నాయి. 2003 జనవరిలో నకిరేకల్ వ్యవసాయ మార్కెట్‌లోని రైతు విశ్రాంతి భవనాల్లో ఈ అగ్నిమాపక కేంద్రాన్ని ప్రారంభించారు. విశ్రాంతి భవనం పక్కనే ఫైరింజన్ కోసం తాత్కాలిక షెడ్డును ఏర్పాటు చేశారు. ఈ అగ్నిమాపక కేంద్రంలో మొత్తం 16మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా ప్రస్తుతం ఆరుగురు మాత్రమే ఉన్నారు. మరో 10 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

నిధులు వచ్చే.. పాయే..

నకిరేకల్‌లో అగ్నిమాపక కేంద్రానికి పక్కా భవనం నిర్మించేందుకు 2013లో రూ.25 లక్షలు మంజూరు కాగా అనువైన స్థలం దొరక్క ఆ నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. 2014లో కూడా రూ.45లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులు కూడా వెనక్కి వెళ్లిపోయాయి. పక్కా భవనం నిర్మాణానికి పెద్ద మొత్తంలో నిధులు మంజూరైనా అవి సకాలంలో వినియోగించకపోవడంతో వెనక్కి వెళ్లి పోతున్నాయి.

ఫైర్ స్టేషన్ అధికారుల నంబర్లు	
ఫైర్ స్టేషన్	అధికారి ఫోన్ నంబర్
నల్లగొండ	87126 99319
మిర్యాలగూడ	87126 99321
దేవరకొండ	87126 99323
నకిరేకల్	87126 99325
హాలియా	87126 99327
సూర్యాపేట	87126 99329
హుజూర్‌నగర్	87126 99333
కోదాడ	87126 99331
భువనగిరి	99482 36458
మోత్కూరు	87126 99343
యాదగిరిగుట్ట	9492441879
చౌటుప్పల్	93466 43001
ఆలేరు	9177206792

సొంత భవనం లేక ఇబ్బందులు



నకిరేకల్‌లోని ఫైర్ స్టేషన్‌కు పక్కా భవనం లేదు. భవనం నిర్మాణానికి స్థలం లేకపోవడంతో ప్రభుత్వం నుంచి మంజూరవుతున్న నిధులు వెనక్కి వెళ్లిపోతున్నాయి. గత 20ఏళ్ల నుంచి తాత్కాలిక షెడ్డులోనే ఫైరింజన్‌ను పెట్టి విధులు నిర్వహిస్తూ ఇబ్బందులు పడుతున్నాం. ఎండాకాలంలో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పొలాల్లో గడ్డిని తగలబెట్టే సమయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి.
– భీముడు, ఫైర్ స్టేషన్ అధికారి, నకిరేకల్

పొలం వద్దకు వెళ్లి.. బావిలో శవమై తేలిన రైతు


వెంకటయ్య మృతదేహం

పెద్దవూర: తన వ్యవసాయ బావి వద్ద పొలానికి మోటారు పెట్టి వస్తానని ఇంటి నుంచి వెళ్లిన రైతు బావిలో శవమై తేలాడు. ఈ ఘటన మండలంలోని కొత్తలూరు గ్రామంలో గురువారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తలూరు గ్రామానికి చెందిన రావులపాటి వెంకటయ్య(50) బుధవారం ఉదయం గ్రామంలోని తన వ్యవసాయ పొలం వద్దకు మోటారు పెట్టడానికి వెళ్లాడు. రాత్రి వరకు కూడా అతడు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గ్రామంలో, బంధువుల ఇళ్లలో ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. కాగా గురువారం ఉదయం వ్యవసాయ భూమి వద్దకు వెళ్లి వెతకగా బావిలో శవమై కనిపించాడు. తన తండ్రి మృతి పట్ల గ్రామంలోని కొంతమందిపై అనుమానం వ్యక్తం చేస్తూ మృతుడి కుమారుడు నాగరాజు ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పోలీసులు నాగార్జునసాగర్‌లోని కమలానెహ్రూ హాస్పిటల్‌కు తరలించారు.

భార్యకు కాళ్ల మెట్టెలు తెచ్చేందుకు వెళ్లి..

- రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


నరేష్ మృతదేహం

కోదాడరూరల్, అనంతగిరి: భార్యకు కాళ్ల మెట్టెలు తెచ్చేందుకు వెళ్లిన భర్త ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో దుర్మరణం పాలైన ఘటన కోదాడ మండలంలోని దొరకుంట గ్రామం వద్ద విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై గురువారం చోటు చేసుకుంది. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. అనంతగిరి మండలంలోని అమీనాబాద్ గ్రామానికి పాయిలి నరేష్(30) భార్యకు మెట్టెలు తెచ్చేందుకు ఆమెతో కలిసి గురువారం టీవీఎస్ ఎక్సెల్‌పై కోదాడకు వెళ్లాడు. అక్కడ పని ముగించుకుని సమీపంలోని దొరకుంట గ్రామంలో గల బంధువుల ఇంటికి వెళ్లారు. అక్కడ నుంచి తిరిగి స్వగ్రామానికి వచ్చే క్రమంలో భార్యను మరో బంధువు బండి ఎక్కించిన నరేష్ అతడొక్కడే టీవీఎస్ ఎక్సెల్‌పై జాతీయ రహదారిని దాటుతుండగా విజయవాడ నుంచి కోదాడ వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నరేష్‌కు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం కోదాడకు తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉండటంతో ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కాగా ఈ ఘటనపై గురువారం రాత్రి వరకు తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని కోదాడ రూరల్ పోలీసులు తెలిపారు.

డోజర్ కింద పడి యువకుడు దుర్మరణం

తుంగతుర్తి: డోజర్ కింద పడి యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని రావులపల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గొట్టిపర్తి ఆవాసం దుబ్బతండాకు చెందిన భూక్య చంద్రశేఖర్(27) తన డోజర్‌తో రావులపల్లి గ్రామంలో ఉదయం దుక్కి దున్నడానికి వెళ్లాడు. పనిచేస్తున్న క్రమంలో డోజర్ మధ్యలో ఆగిపోయింది. దీంతో చంద్రశేఖర్ కిందికి దిగి డోజర్‌కు మరమ్మతులు చేస్తుండగా డోజర్ గేర్‌లో ఉండటంతో ఒక్కసారిగా స్టార్ట్ అయి చంద్రశేఖర్ పైనుంచి వెళ్లింది. ఈ ఘటనలో చంద్రశేఖర్ మెడ భాగంలో తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

దేవరకొండ: కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం దేవరకొండ పట్టణంలో చోటు చేసుకుంది. దేవరకొండ ఎస్‌ఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన ఆతుకూరి శివకనకదుర్గయ్య(54) స్థానిక ఎంకేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గత కొన్నేళ్లుగా నైట్ వాచ్‌మెన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. దుర్గయ్యకు ముగ్గురు కుమారులు సంతానం కాగా వారికి వివాహాలు అయ్యాయి. రెండు సంవత్సరాల క్రితం శివకనకదుర్గయ్య పెద్ద కుమారుడు ఓ ప్రమాదంలో మృతిచెందాడు. కాగా గత కొన్ని రోజులుగా కుటుంబంలో కలహాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో మనస్తాపానికి గురైన శివకనకదుర్గయ్య విధి నిర్వహణలో ఉండగా గురువారం తెల్లవారుజామున కళాశాల ఆవరణలోని క్రీడా మైదానంలో ఇనుప రాడ్డుకు తాడుతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం 6గంటలు దాటినా దుర్గయ్య ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు కళాశాల వద్దకు వెళ్లి చూడగా అప్పటికే విగతజీవిగా కనిపించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య పుష్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో మరొకరు..

మర్రిగూడ: ఆర్థిక ఇబ్బందులతో పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని లెంకలపల్లిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ కె. రంగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. లెంకలపల్లి గ్రామానికి చెందిన చాపల రవీందర్(30) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య రమాదేవి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న రవీందర్ మనస్తాపానికి గురై గురువారం ఉదయం ఇంట్లో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఇది గమనించిన అతడి భార్య చుట్టుపక్కల వారి సహాయంతో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించించినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పురుగు మందు తాగి బలవన్మరణం


కోటేష్ (ఫైల్)

హాలియా: భయాందోళనతో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఈ ఘటన అనుముల మండలంలోని కుమ్మరికుంట గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కుమ్మరికుంట గ్రామానికి చెందిన కన్నెబోయిన కోటేష్(20) కొంతకాలంగా తన ట్రాక్టర్‌తో ఇసుక రవాణా చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ఉదయం తన ట్రాక్టర్‌తో ఇసుక రవాణా చేస్తున్న క్రమంలో కుపాసిపల్లి గ్రామం నుంచి నల్లగొండకు బైక్‌పై వెళ్తున్న రోజువారి కూలీ ఎస్‌కే ఉస్మాన్‌ను మారేపల్లి గ్రామ సమీపంలో వెనుక నుంచి ట్రాక్టర్‌తో ఢీకొట్టడంతో ఉస్మాన్ మృతిచెందాడు. దీంతో భయాందోళనకు గురైన కోటేష్ అదే రోజు కనగల్ గ్రామ శివారులో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు గమనించి అతడిని నల్లగొండని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు.

సీఈఓపై హత్యాయత్నం

- ఓ ఇంట్లో తలదాచుకోగా వారిపై కూడా విక్షణారహితంగా దాడి

నూతనకల్: మండల వ్యవసాయ సహకార పరపతి సంఘంలో సీఈఓగా విధులు నిర్వర్తిస్తున్న బిక్కుమళ్ల గ్రామానికి చెందిన సమ్మెట వెంకన్నపై బుధవారం రాత్రి అదే గ్రామానికి చెందిన కొందరు హత్యాయత్నం చేశారు. వారి నుంచి తప్పించుకుని ఓ ఇంట్లో తలదాచుకోగా ఆ ఇంట్లోని వ్యక్తులపై కూడా దాడి చేసి గాయపర్చారు. బాధితులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకన్న బుధవారం రాత్రి మండల వ్యవసాయ సహకార పరపతి సంఘంలో విధులు ముగించుకొని బైక్‌పై గ్రామానికి వెళ్తుండగా పెదనెమిల–బిక్కుమళ్ల గ్రామాల మధ్య 365వ నంబర్ జాతీయ రహదారిపై బిక్కుమళ్ల గ్రామానికి చెందిన వనం శ్రీను, కప్పల సుమన్‌తో పాటు మరికొంత మంది మాటువేసి కర్రతో దాడి చేశారు. వారి నుంచి తప్పించుకున్న వెంకన్న ప్రాణ రక్షణ కోసం గ్రామ శివారులోని సమ్మెట సుధాకర్ ఇంటిలో తలదాచుకున్నాడు. అయినప్పటికీ ఇంట్లోకి చొరబడి వెంకన్నతో పాటు సమ్మెట సుధాకర్, అతడి భార్య ఉమ, కుమారుడు భరత్‌పై దాడిచేసి విచక్షణారహితంగా కొట్టడంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులకు గ్రామస్తులు సమాచారం అందించగా వారిని చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం, తుంగతుర్తి సీఐ నాగార్జునగౌడ్ సందర్శించారు. దీనిపై పోలీసులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా స్పందించలేదు.

అట్రాసిటి కేసుపై డీఎస్పీ విచారణ

నూతనకల్: మండల పరిధిలోని వెంకెపల్లి గ్రామంలో ఇటీవల నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసును సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం గురువారం క్షేత్రస్థాయిలో విచారించారు. వివరాలు.. వెంకెపల్లి గ్రామానికి చెందిన కందాల లింగారెడ్డి గత వారం తన వ్యవసాయ క్షేత్రంలో పండుగ చేయగా, గ్రామానికి చెందిన సైదిరెడ్డి ఆదిరెడ్డి, పాల్వాయి లింగయ్య హాజరయ్యారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య చిన్న వాగ్వాదం జరగగా, తనను సైదిరెడ్డి కులం పేరుతో దూషించాడని పాల్వాయి లింగయ్య నూతనకల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా స్థానిక ఎస్‌ఐ ప్రసాద్ కేసు నమోదు చేశారు. ఈ మేరకు ప్రత్యక్ష సాక్షులను డీఎస్పీ విచారించారు. ఆయన వెంట ఎస్‌ఐ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

- కొరటికల్ గ్రామంలోని శ్మశానవాటికలో ఘటన


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న నల్లగొండ డీఎస్పీ నర్సింహారెడ్డి

మునుగోడు: మండల పరిధిలోని కొరటికల్ గ్రామంలో గల శ్మశానవాటిక స్నానాల గదిలో గుర్తుతెలియని మహిళ మృతదేహం గురువారం లభ్యమైంది. మృతదేహాన్ని 20రోజుల క్రితమే గుర్తుతెలియని వ్యక్తులు పడేసినట్లు స్థానిక పోలీసులతో పాటు గ్రామస్తులు అనుమానిస్తున్నారు. వివరాలు.. కొరటికల్ గ్రామంలో ఎవరు చనిపోయినా గ్రామ శివారులోని వాగు పక్కనే మూడేళ్ల క్రితం నిర్మించిన శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహిస్తుంటారు. అయితే గత మూడు నెలలుగా గ్రామంలో ఎవరూ చనిపోకపోవడంతో శ్మశానవాటికలోని స్నానాల గదులను ఎవరూ వినియోగించలేదు. కాగా బుధవారం అదే గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలు మృతిచెందడంతో కుటుంబ సభ్యులు గురువారం అంత్యక్రియలు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. దీంతో గ్రామపంచాయతీ సిబ్బంది స్నానాల గదులకు అవసరమైన నీటిని ట్యాంక్‌లోకి ఎక్కించేందుకు శ్మశానవాటికకు వెళ్లారు. ట్యాంక్‌లోకి నీరు పెట్టి స్నానాల గదుల తలుపులు తీయగా గుర్తుపట్టలేని స్థితిలో ఉన్న ఓ మహిళ మృతదేహం కన్పించింది. వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించగా, ఎస్‌ఐ సతీష్‌రెడ్డి అక్కడకు వెళ్లి పరిశీలించి విషయాన్ని ఉన్నతాధికారులకు వివరించాడు. దీంతో వెంటనే స్పందించిన నల్లగొండ డీఎస్పీ నర్సింహారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని పరిసర ప్రాంతాలను పరిశీలించారు. శుక్రవారం వైద్యాధికారులనే సంఘటనా స్థలానికి పిలిపించి పోస్టుమార్టం చేసేలా ఏర్పాట్లు చేయాలని స్థానిక పోలీసులకు డీఎస్పీ సూచించారు.

అత్యాచారం చేసి హత్య చేసినట్లు అనుమానం

మృతదేహం పరిసరాలను చూస్తే ఆమెపై గుర్తుతెలియని వ్యక్తులు అత్యాచారం చేసి హత్య చేసి ఉండవచ్చునని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతిచెందిన మహిళ స్థానికురాలు కాకపోవచ్చని, కానీ హత్య చేసిన వ్యక్తులకు ఈ ప్రాంతంపై అవగాహన ఉండి ఉండవచ్చని గ్రామస్తులు అంటున్నారు. తమ గ్రామంలో ఓ మహిళని హత్య చేసి పడేయడంతో కొరటికల్ గ్రామస్తులంతా ఆందోళన చెందుతున్నారు.

ఆటో డ్రైవర్ నిర్లక్ష్యం.. బాలిక మృతి


చికిత్స పొందుతున్న చిన్న కుమార్తె మారియాను చూసి విలపిస్తున్న తండ్రి

భువనగిరి: చెత్త సేకరించే ఆటో డ్రైవర్ నిర్లక్ష్యం ఓ బాలిక ప్రాణాన్ని బలిగొన్నది. ఈ ఘటన భువనగిరి మున్సిపాలిటీ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. వివరాలు.. అస్సాం రాష్ట్రానికి చెందిన అశ్ర అలీ, కాన్సోస్ దంపతులు తమ ఇద్దరు కుమార్తెలు అఫ్సానా(9), మారియాతో కలిసి నెల క్రితం భువనగిరికి వలస వచ్చారు. ప్రస్తుతం మున్సిపాలిటీకి చెందిన డంపింగ్ యార్డులో నివాసముంటూ ప్లాస్టిక్ కవర్లను సేకరించి విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. గురువారం ఇద్దరు కుమార్తెలు డంపింగ్ యార్డులో ఉన్న శిలాఫలకం వద్ద ఆడుకుంటుండగా, చెత్త సేకరించిన ఆటో డంపింగ్ యార్డులో చెత్తను వేసేందుకు వచ్చింది. చెత్తను డంప్ చేసిన తర్వాత ఆటో డ్రైవర్ అతివేగంగా, నిర్లక్ష్యంగా వాహనాన్ని వెనుకకు తీసుకునే క్రమంలో శిలాఫలకాన్ని ఢీకొట్టింది. దీంతో శిలాఫలకం పక్కనే ఆడుకుంటున్న ఇద్దరు బాలికలపై శిలాఫలకం పడగా, అఫ్సానా అక్కడికక్కడే మృతిచెందింది. అక్కడే ఉన్న సిబ్బంది 108 వాహనంలో తీవ్రగాయాలపాలైన మారియాను జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మృతిచెందిన బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రి మార్చురీకి తరలించారు. తండ్రి అశ్ర అలీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు.

మహేష్ ఆస్పత్రి నిర్వాహకుడు అరెస్ట్

- హైదరాబాద్‌కు తరలించిన సీసీఎస్ పోలీసులు
- నకిలీ బిల్లులతో సీఎంఆర్‌ఎఫ్ నిధులు కాజేసిన కేసులో సమగ్ర దర్యాప్తు

మిర్యాలగూడ అర్బన్ : నకిలీ మెడికల్ బిల్లులు సృష్టించి సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు కాజేసిన మిర్యాలగూడ పట్టణంలోని డాక్టర్స్ కాలనీలో గల మహేష్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ నిర్వాహకుడు ప్రకాశ్‌ను గురువారం సీసీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో సమగ్ర దర్యాప్తు చేసేందుకు గాను అతడిని హైదరాబాద్‌కు తరలించినట్లు సమాచారం. ప్రకాశ్ సూర్యాపేట జిల్లా పాలకీడు మండలం చెరువుతండాకు చెందిన బాణావత్ లక్ష్మి, బాణావత్ జ్యోతి, దామరచర్ల మండలం జేత్రాం తండాకు చెందిన డి. నాగ పేరిట నకిలీ మెడికల్ బిల్లులు సృష్టించి సీఎంఆర్‌ఎఫ్ నిధులు కాజేసిన విషయం తెలిసిందే. కాగా నాలుగేళ్లలో కోనార్క్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్, సూర్య జనరల్ హాస్పిటల్, తెలంగాణ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్, మహేష్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ఇలా పేర్లు మార్చి నకిలీ బిల్లులతో ఎంతమంది పేరిట సీఎంఆర్‌ఎఫ్ నిధులు కాజేశారో అనే కోణంలోనూ సీసీఎస్ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. దర్యాప్తు పూర్తయితే స్కాం ఎలా చేశారు, ఇంకా ఎంతమందికి ఇచ్చారు, సూత్రధారులు ఎవరెవరు ఉన్నారు అనే పూర్తి వివరాలు తెలిసే అవకాశం ఉంది.

అదుపుతప్పి ఫెన్సింగ్ రాళ్ల ట్రాక్టర్ బోల్తా

- ఒకరు మృతి, ముగ్గురికి గాయాలు
- ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం పండితాపురం వద్ద ఘటన
- మృతుడు సూర్యాపేట జిల్లా అనంతగిరి వాసి


ఘటనా స్థలిలో ప్రవీణ్ మృతదేహం

కామేపల్లి(కారేపల్లి), అనంతగిరి: ఫెన్సింగ్ రాళ్ల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా కొట్టగా ఒకరు మృతిచెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం పండితాపురంలో గురువారం చోటు చేసుకుంది. వివరాలు.. సూర్యాపేట జిల్లా అనంతగిరి మండల కేంద్రానికి చెందిన చిన్నం ప్రవీణ్(35)తో పాటు సూరేపల్లి కిరణ్, నకిరికంటి సతీష్, మందా సందీప్, డ్రైవర్ నకిరికంటి బాబు అనంతగిరి నుంచి ట్రాక్టర్‌లో ఫెన్సింగ్ రాళ్లు తీసుకుని ఖమ్మం జిల్లా కామేపల్లి మండలంలోని ముచ్చర్ల గ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో పండితాపురం స్టేజీ వద్ద ఓ కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో బైక్ ముందుకు వచ్చింది. అదే సమయంలో ద్విచక్రవాహనాన్ని తప్పించబోయిన ట్రాక్టర్ డ్రైవర్ బాబు ట్రాక్టర్‌ను రోడ్డు కిందకు దించి మళ్లీ ఎక్కించే ప్రయత్నం చేయగా ఇంజన్, ట్రక్కు మధ్య లింక్ ఊడిపోయి బోల్తా పడింది. దీంతో ట్రక్కులో కూర్చున్న చిన్నం ప్రవీణ్‌పై రాళ్లు పడగా అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనలో కిరణ్, సతీష్, సందీప్‌కు సైతం తీవ్రగాయాలు కాగా ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్లు కామేపల్లి ఏఎస్సై రాజు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

మునగాలలో రూ.రెండు లక్షల సొత్తు చోరీ


ఇంట్లో చిందరవందరగా సామాన్లు

మునగాల: మండల కేంద్రంలోని ఓ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి రూ.2లక్షల సొత్తు అపహరించారు. ఈ సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని సీఐ కార్యాలయం పక్కన రవీందర్ అనే వ్యక్తి నూతనంగా ఇంటిని నిర్మించి ఇటీవలే గృహప్రవేశం చేశాడు. అతడు నూతన ఇంట్లో ఉంటూనే, రాత్రివేళ తాను అద్దెకు ఉండే పాత ఇంట్లో కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. మొదటి అంతస్తు తాను ఉంచుకొని, కింద బ్యాచిలర్స్‌కు అద్దెకు ఇచ్చాడు. బుధవారం గుర్తుతెలియని వ్యక్తులు కింద ఉన్న కిచెన్‌లోకి ప్రవేశించిన వంట సామానులు చిందరవందర చేసి పై అంతస్తులోకి వెళ్లి ప్రధాన ద్వారానికి వేసిన తాళం కప్పను పగులగొట్టి పూజ గదిలో ఉన్న సుమారు రూ.80వేల విలువైన వెండి సామాన్లు, బెడ్‌రూమ్‌లో తులన్నర బంగారు గొలుసుతో పాటు రూ.7వేల నగదును ఎత్తుకెళ్లారు. గురువారం ఉదయం రవీందర్ నూతన ఇంటికి వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉండడంతో 100 నంబర్‌కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వచ్చి చోరీ జరిగిన తీరును పరిశీలించారు. సుమారు రూ.రెండు లక్షల విలువ బంగారు, వెండి సొనులు చోరీకి గురైనట్లు గుర్తించి స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు. ఈ మేరకు మునగాల ఎస్‌ఐ పి. లోకేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.